# బ్రతుకు బాటలు

బందరు బస్సుస్టాండు జనంతో సందడిగా వుంది. బెజవాడ కెళ్ళేవి, గుడివాడ కెళ్ళేవి, ఏలూరుకెళ్ళేవి - యింకా అటు నాగాయలంక కెళ్ళేవి, మరి అటునుండి వచ్చేవి -స్టాండులో నిత్యప్రయాణం! స్టాండుకు ముందుగా, షోడాషాపు ప్రక్కనే కూర్చున్నారు యిద్దరు ముగ్గురు ఆడ వాళ్ళు ఏవిటేవిటో అమ్ముకుంటూ! దారినిపోయే జనాన్ని ఒక నిముషం ఆపివేస్తుంది నడుమగా కూర్చున్న బంగారు. వేసవిలో కొల్లలుగా వచ్చిన మల్లెలు ముందేసుకుని, దండలు కడుతూ కూర్చుంది. ముప్పై యేళ్ళుంటాయి. పేరుకుదగ్గ ఛాయ. పరిపుష్టమై బిగువుగా బుసలుకొట్టే శరీరం. ముఖాన పాలభాగాన్ని నిలువుగా విభజిస్తూ పైకి ఎగబ్రాకిపోయిన పచ్చబొట్టు, భారమైన కేశసంపద పెట్టని సొమ్ములు బంగారుకు. పూలుకడుతూ వచ్చే పోయేవారిని యథాలాపంగా పరికిస్తున్న బంగారు తన కెదురుగా వస్తున్న తల్లి బిడ్డలను జూచి ఒకక్షణం బ్రమాస్పడిపోయింది. తల్లి చెయ్యి పట్టుకుని నడుస్తున్న నాలుగేళ్ళ పిల్లవాణ్ణి పరీక్షగా చూసింది. ఆ మనిషి తన దగ్గరకు రాగానే ఉత్సుకత అణచుకోలేక "ఏ వూరమ్మా మీది?" అని పలుకరించింది.

"మేమా, ఏలూరుపోవాలి, యింకెట్లాపోవటం" అని నిట్టూర్చింది.
"ఏం ఎందుకని ఇంకో అరగంటకు బయలుదేరుతుందే ఏలూరుకెళ్లే బస్సు" అంది బంగారు.

"చిల్లర కొంగున ముడివేసుకున్నాను. ఎక్కడ జారిపోయిందీ తెలియదు, చేతిలో కానీలేదు ఎట్లా పోవటం, పిల్లల కేమన్నా పెట్టిద్దా మన్నా లేదు" అన్నదా మనిషి దాదాపు ఏడుస్తూ! కుర్రవాడు తల్లికొంగు పట్టి లాగుతూ 'ఆకలేస్తుందే' అన్నాడు. వాడి అక్క ఒక ఎనిమిదేళ్ళది పెద్ద ఆరిందాలాగా "డబ్బులు పోయినయ్యంటే ఆకలంటావేరా?" అని అదమాయించింది. బంగారు ఆ పిల్లవాని ముఖం చూచి కరిగిపోయింది. గబగబ పూలు బుట్టలో సర్దేసి, మా యిల్లు దగ్గిరే పదండమ్మా!" అన్నది. ఆ మనిషి కర్థం కాలేదు. "ఫరవాలేదు రావమ్మా. నీ పేరేమి టన్నావ్" అంది బంగారు. "పార్వతి" అన్నదా మనిషి. "యీ బుట్ట నువ్వుపట్టుకో, వాణ్ణి నేను ఎత్తుకుంటాలే" అంది బంగారు. ఆ పిల్లవాడు బంగారు దగ్గరకు రాలేదు ముందు. "వెళ్ళు, ఎవరనుకున్నావ్, మీ పిన్నమ్మకాదూ" అంది వాడి తల్లి. బంగారు ఎందుకో లోపల వణికి పోయింది, పిల్లవాణ్ణి ఎత్తుకుని బుల్లాడా, నీ పేరేంటి? అంది. వాడు పలుక లేదు.

"వాడి పేరు కృష్ణుడు" అంది వాడక్క. బంగారు నవ్వి "నీ పేరూ?" అంది. నా పేరు "సీత" అందాపిల్ల.

బంగారు కృష్ణునిదింపి ఇల్లు తాళం తీసింది. అది మట్టిగోడల యిల్లు. పైన తాటాకు కప్పు. గోడలు తెల్లగా సున్నంకొట్టి వున్నాయి. లోపలంతా అలికి పరిశుభ్రంగా వుంది. బంగారు మూలనున్న చాపతెచ్చి పరిచింది. "పిళ్ళకు నీళ్ళుపోసి నువ్వుకూడా స్నానంచెయ్య అప్పా. నే వంట చేస్తాను" అన్నది బంగారు. పార్వతి మరి మాట్లాడలేదు. ఆమె, పిల్లలు స్నానంచేసి భోంచేశారు.

"అయితె ఏంటి కథ, నువ్వీ పూరు ఎందుకు వచ్చినట్టు, ఎందుకు వెళ్తున్నట్టు?" అంది బంగారు.

"మా అన్నయ్య వుండేవా డీవూళ్ళో. ఏదో వాడి అసరాతో యీ వూళ్ళో వుండిపోదామని వచ్చాను. ఇక్కడే సైంటిఫిక్ కంపెనీలో పనిచేసేవాడు. ఇప్పుడు పోయి అడిగితే, యీ వూరినుంచి వెళ్ళి చాల

రోజులయిందన్నారు. ఎక్కడికి వెళ్ళిందీ ఎవరూ చెప్పలేదు. ఇంకేం చెయ్యను? మళ్ళీ చావో, బ్రతుకో ఇంటికి పోవాలి" అంది పార్వతి.

"మరయితే మీ మొగమనిషి-" ఆపోసింది బంగారు. పార్వతి జావురుమని ఏడ్చేసింది:

"వూరుకో, వూరుకో ఏడవమాకు."

"ఆనెల్లనాడు ఉన్నట్టుండి మాయమైపోయాడు. ఏపాపం ఎరగను నేను. ఒక తెల్లారి లేచి చూస్తే పక్కమీది లేడు. రేపువస్తాడు, మాపు వస్తాడనుకుంటూ నెల గడిపాను. తర్వాత తిండిఎట్లా? ఆ అమ్మను యీ అమ్మను పట్టుకుని ఎవరింట్లోనో వంటకు కుదిరాను, కాని చూడు, కని పెట్టుకునే మగదిక్కులేని ఆడదని తెలిశాక ఎవరికైనా అలుసే! ఏం చెప్పను. భయమేసి పని మానుకుని వూరు విడిచిపెట్టి వచ్చేశాను. ఈ వూళ్ళో అన్న ఒకడున్నాడుగదా, ఏదో నారెక్కల కష్టంమీదనే బ్రతికినా? మాటవరసకు మగదిక్కనుకున్నా: నా ప్రారబ్దం, ఆ దిక్కూలేదు, రోజులు ఎట్లా గడవాలో, అర్థంకావటం లేదు" అంది పార్వతి.

బంగారు బరువుగా నిట్టూర్చింది. కృష్ణుడి ముఖంకేసి పరీక్షగా చూస్తూ "ఏంపని చేసేవోడు" అంది. "పనా, ఏంపనో నాకేం తెలియదు. సాయంత్రానికి రెండు రూపాయలకు తక్కువిచ్చేవాడు కాదు. వూళ్ళో అందరు "రవుడీ రంగన్న" అనేవారు. పాముకాటు తిన్నట్లయింది బంగారుకు.

"ఏంటీ అట్లా వులిక్కిపడ్డావ్" అంది పార్వతి,

"ఆమధ్య యీ వూళ్ళో ఆ పేరెక్కడో విన్నట్టుంది."

"ఆ, ఆజాడ నీకేమైనా తెలుసా"

"తొందర పడమాకు, కనుక్కుందాంలే, మా యింటాయనకి చెప్పి వెదికిస్తాను" అంది బంగారు. కృష్ణుణ్ణి నెమ్మదిగా ఒళ్ళోకి తీసుకొని, ఆ వ్యక్తి భావపరంపరలో వూగిపోతూ వాడి బుగ్గలు నిమరసాగింది బంగారు.

"మీ ఆయన కేంటి పని?"

బంగారు వినిపించుకోలేదు. కొన్ని క్షణాలకు తేరుకుని ఆ పళ్ళ దుకాణం వుంది అన్నది.

"నువ్వు మల్లెపూ లమ్మితే, ఆయన మామిడి పళ్ళమ్మతా డన్న మాట. మా బాగా వుంది. అదేంటి, అట్లా అయిపోయావేంటి" అంది పార్వతి ఆశ్చర్యంగా.

"అబ్బే! ఏం లేదు. అయ్యో నాతెలివి మండినట్టే వుంది. అన్నం పట్టికెళ్ళద్దూ" అని కృష్ణుణ్ణి దింపి లేచింది. తర్వాత నవ్వుతెచ్చుకుని "వీడు వాళ్ళఅయ్య పోలికేమిటి?" అంది "వూ మరీను, నోట్లోంచి వూడి పడ్డట్టే ఉంటాడు." అంది పార్వతి.

బంగారు అన్నం సగం సర్ది ఏమనుకుందో తటాలున అన్నం తిరిగి కుండలోవేసి మూత పెట్టింది. మేకునున్న బుట్ట చేత్తో తీసుకుంది. నామతి మండిపోయింది కూరేవండలే దివ్వాళ" అంది బంగారు. "అంతా మాకే పెట్టేసినావేంటి" అంది పార్వతి బాధగా. "ఉహు కాదు ఇవాళ ఆ కూరవద్దు, బజారెళ్ళొస్తా" అని వెళ్ళబోయింది బంగారు. బంగారును చూస్తున్నకొద్దీ పార్వతి ఆశ్చర్యం పెరిగిపోతోంది. పది నిముషాల్లో తిరిగి వచ్చిన బంగారు యింకా సేపటికి గిన్నెల్లో అన్నం, కూర సర్ది మూట కట్టుకుని పళ్ళ దుకాణంకేసి నడిచింది.

తనకోసం ఎదురు చూస్తున్న రంగన్నను చూసి బలవంతాన నిట్టూర్పు అణచుకుంది బంగారు.

"ఇంత ఆలస్యం చేసినావేంటి?" అన్నాడు రంగన్న.

"ఒక రోజు ఆలస్యమయితేనేం? రేపటినుంచి పెందలకాడే తిందువుగానీలే" అంది బంగారు.

"ఏంటట్లా వున్నావ్, ఏం జరిగిందేమిటి?"

"ఏమిగాలా. నువ్వన్నం తిను."

"వో—యిందుకా యింత ఆలస్యం. చెప్పావుగాదేం మరి" అన్నాడు రంగన్న కూర రుచి చూస్తూ. భోంచేస్తున్న రంగన్న తలెత్తి

బంగారు ముఖంకేసి చూచాడు. బంగారు మాటా మంతీ లేకుండా కూర్చోటానికి రంగన్న విస్తుపోయాడు.

"ఏం పుట్టి మునిగిందే, మూతి మూరెడు చేసుకున్నావ్" అన్నాడు రంగన్న నవ్వుతూ.

"మునిగితే నా పుట్టే మునుగుతుంది, నీదేం పోతుంది."

"ఛత్, నే నన్నం తినను ఫో గిన్నె తీసికెళ్ళు."

"నీ కాళ్ళు పట్టుంటా, యివాళ నా పని బాగలేదు. నేనేమన్నా వూరుకో యీ వక్కరోజుకు" అంది బంగారు బొంగురుపోయిన గొంతుతో! రంగన్న మాట్లాడలేదు. కాసేపటికి "అదేంటి, అన్నం అంతా అట్లా కెలికేస్తున్నావు, ఒక్క మెతుకిడిచిపెడితే నామీద ఒట్టు" అంది ఆదుర్దాగా! రంగన్న మరి మాట్లాడలేదు. చివరకు "యీ రెండు ముద్దలు నీకు" అన్నాడు. బంగారుకు ఏడ్పు ఆగలేదు. బలవంతంగా మాట పెగల్చుకుని "ఏదీ నా చేతిలో నువ్వే పెట్టు" అంది. రంగన్న నవ్వు తెచ్చుకుని "చేతిలోనా, నోట్లోనా" అన్నాడు. బంగారు చెయ్యి వెనక్కి తీసికొని నోరు తెరిచింది. బంగారు వాలకం రంగన్నకేమీ అర్థం కాలేదు. "ఎందుకేడుస్తావ్ బంగారూ, చెప్పవ్, ఒంట్లో బాగాలేదా, ఏదైనా గుర్తుకొచ్చిందేంటి? వుండు దుకాణం మూసి నేకూడ వస్తా" అన్నాడు. బంగారు కంగారుగా "వద్దు, నయ్యం, నాకేమయ్యింది కనుక. సాయంత్రం పెందలాడే రా, నే వెళ్తా" అని రంగన్న జవాబుకోసం ఎదురుచూడకుండానే యింటిదారి పట్టింది.

పార్వతి బంగారుకోసం ఎదురుచూస్తోంది. క్రొత్త మనిషిమీద యిల్లు విడచివెళ్ళిన బంగారు సాహసానికి రిచ్చపోయింది. బంగారువచ్చి "ఏం అప్పా! కాసేపు పడుకోపోయినావ్, పిల్లలు నిద్రోయారే" అంది.

"ముందు నువ్వు భోంచెయ్యి" అంది పార్వతి.

"నే నక్కడే భోంచేసి వచ్చా" నంది బంగారు.

"రోజూ అక్కడే భోంచేస్తావేమిటి" అంది పార్వతి.

బంగారు నవ్వింది. బంగారు "సౌభాగ్యాని"కి మురిసిపోయింది పార్వతి. కాస్సేపట్లో పార్వతికి నిద్రపట్టిపోయింది. వేసవికాలపు మధ్యాహ్నాలు. కళ్ళుమూస్తే కునుకు చేరుతుంది. బంగారు కన్నుమూత పడలేదు. గడచిన జీవితం గుర్తుకురాక ఆగలేదు.

బంగారు బందరు చేరి ఎనిమిది నెలలే అయ్యింది. ఇద్దరి ముగ్గురి యిళ్ళల్లో పాచిపని చేసేది. ఆ రోజుల్లోనే రౌడీగా చలామణి అవుతున్న రంగన్న ఒకరోజు బంగారుతో ఏమో అన్నాడు. బంగారు "పిచ్చిగా మాట్లాడకు పళ్లూడగొడ్తాను" అంది కాని బంగారుకా విధంగా ఎన్నో రోజులు గడవలేదు. ఉన్నట్టుండి ఒకరోజు తనేపని పెట్టుకుని రంగన్న దగ్గరకెళ్ళింది.

"ఆరోజు రమ్మన్నావు; వచ్చాను" అంది రంగన్న కళ్ళల్లోకి నిర్వికారంగా చూస్తూ. రంగన్న నవ్వుతూ యింటితాళం తీశాడు. రంగన్న నవ్వుజూచి బంగారు ముఖమెర్రబడిపోయింది. అసహాయంగా ఆమె పెదవులు వణికాయి. రంగన్న సాహసం కొంత తగ్గింది.

"ఏమయ్యింది, ఎందుకొచ్చావ్" అన్నాడు.

"ఏం చెయ్యను, రాత్రిళ్ళు నిద్రపోనీరు. గుడిసెమీద రాళ్ళవర్షం. గుడిసె బైట కంచె అంతా పీకేశారు. రోజు కుండలదగ్గరనుంచి అన్ని మాయమవుతున్నాయి. నేనిక బ్రతకలేను" అంది బంగారు.

"అయితే?" అర్థంకానట్టు అడిగాడు రంగన్న.

"అయితే ఏముంది, నీలాంటి రౌడీ ఎవరైనా ఆసరావుంటే వాళ్ళ పీడ వుండదని—" దుఃఖం, అవమానం, కోపం, నిస్సహాయత పట్టలేక ఏడ్చేసింది బంగారు. రంగన్న బంగారు భుజం తట్టి "ఫరవాలేదు, నేనున్నాలే యిక" అన్నాడు. అనుకోకుండానే బంగారు కొత్త వుద్రేకంలో కొట్టుకుపోయింది. రంగన్నను పట్టుకుని వాస్తవమైన కృతజ్ఞతతో "నీదెంత పెద్ద గుండె" అంది. నిజమే రౌడీ రంగన్న విశాల హృదయుడే. పెద్ద నాపరాయంతవున్న అతని ఛాతీమీద ఆపత్తులోవున్న ఆడవాళ్ళు కనీసం ఇరుగురైనా తలపెట్టుకుని ఆదమరచి నిద్రపోవచ్చు! ఆసాయంత్రం రంగన్న

పట్టెడు పసుపుకుంకం, నూలు దారాలు తీసికొచ్చాడు. బంగారు ముఖాన చిటికెడు కుంకం పెట్టాడు. నూలు దారాలు చూచి బంగారు "ఎందుకివన్నీ, దారాలతో నన్ను కట్టేసుకోలేవు" అంది. తెల్లారి లేచేసరికి బంగారు తన మెళ్ళో పచ్చత్రాడు చూసుకుని నవ్వుకుంది. ఆ విధంగా బంగారుకు పూర్వ సువాసినీత్వం పోయి నిత్య సౌభాగ్యం లభించింది.

"నేనీ దౌర్జన్యపుకూడు, దొంగకూడు తినలేను. చేతయితే సరిగ్గా సంపాయించు. లేదూ, నువుకూర్చో. నేను పనిచేస్తాను" అని బెదిరించింది బంగారు. రంగన్న కాదనలేక తన పూర్వపు వృత్తులన్నీ విడిచి పళ్ళ దుకాణ మొకటి తెరిచాడు. ఏదో మాటల్లో బంగారు అడిగితే రంగన్న తనకు భార్యబిడ్డలంటూ ఎవరూలేరని చెప్పాడు. నిజమే ననుకుంది బంగారు. కాని యీ రోజుకు యింకో అభాగ్యురాలి "సౌభాగ్యం" తన పాలైందని తెలుసుకుని రిచ్చపోయింది. ఈ స్థితిలో తన ధర్మము, కర్తవ్యము ఏమిటో బోధపడలేదు. కళ్ళు కొంగు నొత్తుకుని లేచింది. నెమ్మదిగ పొయ్యిదగ్గరకెళ్ళి చితుకులు సరిచేసి రాత్రికి అంతమందికి అన్నం వార్చింది. ఇంతలో పార్వతి లేచింది.

"అదేమిటమ్మాయి ఇప్పుడన్నం వండుతున్నావ్. కళ్ళన్నీవాచాయే ఏడ్చావా, ఎందుకూ" అంది పార్వతి.

"నువు నిద్రపోతున్నా వప్పా! మా పుట్టింటి దగ్గరనుంచి కబురొచ్చింది. నాకంటె పెద్దదొకతె వుందిలే! మా బావ వదిలేసి చాల రోజులయింది. ఇవాళ ఆయన వచ్చారట. అప్పను తీసికెళ్తారట. పోయి చూసొస్తా నువ్వేం అనుకోకపోతే, నే వచ్చేవరకు యిల్లు చూస్తుంటావూ? త్వరగా వెళ్ళాలె."

పార్వతికి నోటమాట రాలేదు. ఆ విపరీత సన్నివేశానికి మ్రాన్పడిపోయింది. ఏమనటానికి పాలుపోలేదు.

"మీ యింటాయనకి చెప్పి వెళ్ళవా?" ఎప్పుడొస్తావు తిరిగి? నువ్వు లేకుండా నే నెట్లా వుండనిక్కడ" అన్నది.

"ఫరవాలేదు మా ఆయన మహామంచి మనిషి. నువ్వేం భయపడవద్దు. పిల్లలకింత పెట్టి నువ్వింత తిను. ఆయన్ని తినమని చెప్పు. నేను వచ్చేసరికి ఆలస్యమవ్వచ్చు. ఆయన అడిగితే నేను పుట్టింటి కెళ్ళానని, మీ సొమ్మంతా యింట్లోనే వుందని, వెదుకుతూ ఎక్కడికి వెళ్ళవద్దని చెప్పమన్నానని చెప్పు."

"నీ మాటలు నాకేం అర్థం కావటంలేదు" అన్నది పార్వతి.

"నీ కెందుకు అట్లాని చెప్పు. ఆయనకు అర్థమవుతుందిలే" బంగారు చెంగునున్న తాళం చెవులు తీసి పార్వతికిచ్చి గబగబ వెళ్ళిపోయింది. శూన్యదృక్కులు పరుస్తూ, భయాందోళిత మనస్కమై పార్వతి ఆ పూరింట్లోనే వుండిపోయింది.

ప్రొద్దులాటారే వేళకు ఎవరో తలుపుతట్టి 'బంగారూ' అన్నారు. పార్వతి తడికలతో అమర్చిన వంటింట్లోకి వెళ్ళి నుంచుని "సీతా తలుపు తీసి రామ్మా" అంది. తలుపు తీసిన సీత "నాన్నా" అంటూ రంగన్న కేసి చూసింది. రంగన్న కాళ్ళు తడబడ్డాయి. ఈ హటాత్సన్నివేశాని కతడు తట్టుకోలేకపోయాడు. తెల్లబోయి లోపలికి వచ్చాడు. "కృష్ణా, నాన్నరా నాన్న:" అంటూ సీత వంటింట్లోకి వెళ్ళింది. కృష్ణుడు రంగన్న కేసి ఎరగనట్లు చూశాడు. రక్తస్పర్శ మహత్తరమైనది. రంగన్న ఒక క్షణంపాటు తన్ను తాను మర్చిపోయి ముమ్మూర్తులా తననే పోలివున్న కృష్ణుణ్ణి ఎత్తుకుని ఎగరేసి ముద్దాడాడు. మళ్ళీ తేరుకుని 'బంగారూ' అని పిల్చాడు. పార్వతి తడిక అవతల నుంచి వచ్చి రంగన్నకేసి చూసింది.

"పా—ర్వ—తీ" అన్నాడు రంగన్న తడి ఆరిన గొంతుతో!

పార్వతికి పరిస్థితి అంతా అర్థమైంది. ఆమె భయపడుతూ "నాకేం తెలియదు. ప్రొద్దున బస్సుస్టాండులో కనిపించి కృష్ణుణ్ణి ఎగాదిగా చూసి మమ్ముల నింటికి పిలుచుక వచ్చింది. మధ్యాహ్నం పుట్టింటి కెళ్తానని చెప్పి వెళ్ళింది.

"ఆ, ఇంకేం చెప్పింది?"

"మీ సొమ్మంతా యింట్లోనే వుందని, వెదుకుతూ ఎక్కడికీ వెళ్ళవద్దని చెప్పమంది! అప్పు డర్థం కాలేదు నాకు" అంది పార్వతి.

రంగన్న తల బాదుకుంటూ "బంగారూ ఎంత పనిచేశావ్?" అన్నాడు. పార్వతి భయంగా వణికిపోయింది. "ఏదైనా అఘాయిత్యం చేస్తుందంటారా? నా రాత! నే పాదం పెట్టిన చోటల్లా యింతే! ఎంత మంచిది! ఏ అఘాయిత్యమైనా చేసిందంటే మరి నాకు పుట్టగతులుండవు. మీకు దణ్ణం పెడతాను. నేను వీళ్ళను తీసుకుని నా దారిన పోతాను. మీరు వెళ్ళి వెదకండి త్వరగా" అంది.

రంగన్న అచేతనావస్థలో వుండి పార్వతి కేమీ జవాబియ్యలేదు. పార్వతి కళ్ళు తుడుచుకొని, కొడుకు నెత్తుకుని, కూతురిని వెంట పెట్టుకుని ఇల్లు విడిచింది. కాసేపటికి తెప్పరిల్లుకున్న రంగన్న 'పార్వతీ' అంటూ పరుగెత్తాడు. మర్రిచెట్టు క్రింద పార్వతిని ఆపి "పద, వెనక్కి వెళ్ళు, నేను బంగారును తీసుకొస్తా. జాగ్రత్త! ఇల్లు విడిచిపెట్టేవు! నీవు వెళ్ళిపోయావా ఇక బంగారు నా ముఖం చూడదు. వెళ్ళు. నిన్ను ఇదివర కెప్పుడు బ్రతిమాలినట్లు గుర్తు లేదు. నా మాట విను ఇంటికెళ్ళు" అన్నాడు రంగన్న. పార్వతి మౌనంగా ఇంటివేపు నడిచింది.

రంగన్న పరిగెత్తుకుంటూ బస్సుస్టాండు కెళ్ళాడు. బంగారు కాని ఏ బస్సు అయినా ఎక్కిందా అని కనిపించినవాణ్ణల్లా అడిగాడు. ఎవరో ఒక కుర్రాడు "ఇందాక మాచారంవేపు నడుస్తుంటే చూశానండీ!" అన్నాడు. రంగన్న పరిగెత్తాడు రోడ్డువెంట. రాత్రయినా వెన్నెల రక్షించింది. పదకొండు గంటల వేళ బంగారు జాడ కానక నిస్సహాయంగా తిరిగి వస్తున్నాడు రంగన్న. దారిలో చర్చి గేటు లోపల చెట్టు క్రింద ఏదో కదలిక పసిగట్టాడు. పరీక్షగా చూశాడు. లోపలి కెళ్లాడు. చెట్టు క్రింద పచ్చికమీద అలసి నిద్రపోతోంది బంగారు. స్వేచ్ఛతో శరీరం బరువెక్కింది. ఆకలిగొన్నట్లు వెన్నెల నమితంగా త్రాగి మత్తెక్కి ఆకా

శాన్ని చుక్కలను అదివర కెరగనట్లుగా అయోమయంగా చూస్తున్నది. బంగారు సౌందర్యం కాంచి ముగ్ధుడైనాడు రంగన్న. బంగారు భుజాలు కదుపుతూ "బంగారూ లే" అన్నాడు బంగారు లేచింది. రంగన్నను చూసి తెల్లబోయింది. "ఎందుకొచ్చావు నువ్వు?" అంది.

"నీ కోసం" అన్నాడు రంగన్న. బంగారు రంగన్న చెయ్యి పట్టుకుని లేచింది. ఇద్దరు ఇంటి దారి పట్టారు.

"చెప్పకుండా పెట్టకుండా వెళ్ళిపోయావు గదా! నేనెట్లా బ్రతుకుతాననుకున్నావే బంగారూ!"

బంగారు పలుకలేదు. కాసేపటికి—

"రైలో బస్సో ఎక్కటానికి డబ్బులు తెచ్చుకోటం మర్చిపోయినాను. ఈ దారి పడి పోదామనుకున్నా. మధ్యాహ్నమంతా ఏడ్చి ఏడ్చి వున్నానేమో వోపిక లేక పోయింది. ఆకలి! నీరసమొచ్చి ఆ గడ్డి మీద పడుకున్నా. తెల్లారి లేచి వెళ్ళవచ్చని. లేకపోతే నీకు దొరికే దాన్నేంటి" అంది.

"నువు మళ్లీ నాకు దొరికినందుకు విచారిస్తున్నావా?"

బంగారు రంగన్నకేసి చుర చురా చూసి—

"నిన్ను బాగా కొట్టాలనిపిస్తుంది నాకు. కాని వోపిక లేదు" అంది.

"బంగారూ! నీ కేంటి తెలుసు? నా అదృష్టం మహా గొప్పది" అన్నాడు రంగన్న.

ఇద్దరు ఇల్లు చేరేసరికి పన్నెండయింది. పార్వతి తలుపు తెరిచింది. బంగారు పార్వతి చేతులుపట్టుకుని "ఏ అప్పా! నన్ను ఎందుకు రమ్మన్నావు?"—అంది పార్వతి బంగారు కేసి ప్రేమగా చూస్తూ, "నన్నెందుకుండమన్నావే బంగారూ?" అంది. అప్పా అంటూ పార్వతి భుజంమీద వాలింది బంగారు.

"లే, కాళ్లు కడుక్కోండి. యిద్దరూ భోంచేద్దురుగాని" అంది పార్వతి. రంగన్నకు, బంగారుకు వడించింది పార్వతి.

ఆ మర్నాడు బంగారు లేచేసరికి రంగన్న దుకాణానికి వెళ్ళి పోయాడు. బాంగారు పొయ్యి ముందుకెళ్ళింది. పార్వతి వెనగ్గా వచ్చి "లే—లే నీ కిక్కడేం పని, పువ్వులమ్మేదానివి పువ్వులా గుండు. వంటా పాప్పా నీకు దేనికి? నే నేమయ్యాను కనుక" అంది. బంగారు లేచి పోనీలే అప్పా నీ ముచ్చట నే నెందుక్కాదనాలి" అంటూ కొంటెగా నవ్వింది.

బంగారు నులకమంచంమీద పడుకుని కృష్ణుణ్ణి ముద్దులాడుతోంది. "మీ అయ్య ఎంత కర్కోటకుడురా? నువ్వు లేవని చెప్పటానికి నోరెట్లా వచ్చిందో!" అన్నది వాడి ఒళ్లు నిమురుతూ.

"బంగారూ! వాడితో ఆడుతుంటే నీకు ప్రొద్దు తెలియదేంటి? అన్నం పట్టుకుపోయే దెప్పుడు?" అంది పార్వతి.

"ఇట్లా యియ్యప్పా పట్టుకెళ్తాను. రా రా పోదాం" అంది. కృష్ణుణ్ణి లేవదీస్తూ బంగారు.

"వాడెందుకు—నీ వెళ్ళి యిచ్చిరాక" అంది పార్వతి.

"బాగుంది చెట్టంత కొడుకు నుంచుకుని మనకేంటే పని? రేపటి నుంచి ఆడి అయ్య కాడే అన్నం పట్టికెళ్తాడు. రారా, యివాళ దారి చూపిస్తా" అంది బంగారు.

కృష్ణుణ్ణి ఒక చంక నెత్తుకుని, అన్నం మూట ఒక చేత్తో పట్టుకుని దుకాణంవేపు నడిచింది బంగారు. సంతోషంతో పార్వతి కళ్ళు చెమర్చాయి. ఆ దృశ్యం చూసి తన్మయురాలైన పార్వతి "బం-గా-రూ!" అనుకుంది అస్పష్టంగా!

—o—